సాక్షి అనకాపల్లి

గురువారం । 28 । డిసెంబర్ । 2023



కప్ప చేప

విశాఖ: ఉప్పాడ మత్స్యకారుల వలకు బుధవారం అరుదైన సముద్రజీవి కప్ప చేప చిక్కింది. దీనిని మళ్లీ సముద్రంలో వదిలేశారు.



హుండీ ఆదాయం లెక్కింపు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి హుండీ ఆదాయం గడిచిన 30 రోజులకు రూ.2,06,69,033 వచ్చింది.



'ప్రకృతి వనం' ప్రారంభం

విశాఖ: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1లో ప్రకృతి వనం పార్కును స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ బుధవారం ప్రారంభించారు.

ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్రా

ఆడుదాం ఆంధ్రా రెండో రోజు బుధవారం జిల్లా అంతటా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రస్తుతం తొలి దశగా గ్రామ స్థాయిలో జరుగుతుండడంతో ఉత్సాహం ఉన్న వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. పల్లెల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది.



కశింకోట బాలికల హైస్కూల్లో వాలీబాల్ పోటీ



బయ్యవరంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట పాఠశాలలో ఖోఖో పోటీ

గడప గడపకూ ప్రగతి

- ఎమ్మెల్యేల పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారం
- రోడ్, డ్రెయిన్లు, మంచినీటి సమస్యకు తొలి ప్రాధాన్యం



మాడుగుల గ్రామం హైస్కూల్ కాలనీలో గడప గడపకు కార్యక్రమం తర్వాత వేసిన సిమెంట్ రోడ్డు

నియోజకవర్గాల వారీగా.. ప్రాధాన్యత పనుల వివరాలు

నియోజకవర్గం	అప్‌లోడ్ చేసిన పనులు	పూర్తయిన పనులు	పురోగతిలో ఉన్న పనులు	మంజూరు రూ. కోట్లలో
యలమంచిలి	437	43	334	16.55
నర్సీపట్నం	587	54	290	19.53
పాయకరావు పేట	226	90	290	13.42
చోడవరం	434	25	284	12.64
మాడుగుల	334	26	262	12.96
పెందుర్తి	127	6	99	5.0
అనకాపల్లి	144	6	56	8.17

అప్‌లోడ్ చేసిన వినతులు 2,392

పూర్తయినవి 180

పురోగతిలో 1,562

మంజూరైన నిధులు రూ.88.27 కోట్లు



కె.కోటపాడు మండలం చౌడవాడ గ్రామంలో విద్యుత్ పనులు (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: ప్రతి ఇంటికీ అభివృద్ధి ఫలాలను చేర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఈ కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీరు, పారిశుధ్య సమస్య వంటివి పరిష్కారమయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. చివరిలో గడప గడప కార్యక్రమం ముగిసిన గ్రామాల్లో మాత్రం ఇంకా పనులు ప్రారంభం కాలేదు. స్థానిక ఎమ్మెల్యే, సమన్వయకర్తల దృష్టికి తీసుకొచ్చిన ప్రతీ సమస్యకూ పరిష్కారం చూపించారు. టెక్నికల్ సమస్యల కారణంగా సంక్షేమ పథకాలు మంజూరు కాని కేసులు క్లియర్ అయ్యాయి. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, నీటి కుళాయిలు వంటి సమస్యలు పూర్తిగా తీరిపోయాయి.

శరవేగంగా పనులు...

రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రథమ ప్రాధాన్యమిస్తోంది. ప్రతి సచివాలయ పరిధిలో ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన అనంతరం రూ.20 లక్షల వరకు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు అందిస్తోంది. జిల్లాలో 2,392 పనులు అప్‌లోడ్ చేయగా.. వీటిలో 180 పనులు పూర్తయ్యాయి. 1,562 పనులు పురోగతిలో ఉన్నాయి. వీటి కోసం రూ.123 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అంచనా వేయగా.. వాటిలో ఇప్పటికే రూ.88.27 కోట్లు మంజూరయ్యాయి.

గుర్తించిన ప్రతీ సమస్యకు పరిష్కారం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం. అప్‌లోడ్ చేసిన వాటిలో కొన్ని మినహా అన్నింటికీ నిధులు మంజూరయ్యాయి. శరవేగంగా చర్యలు తీసుకున్నాం. అభివృద్ధి పనులు, మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి. మిగిలిన పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేస్తున్నాం. చిన్న చిన్న సమస్యలను ఇప్పటికే పూర్తిగా పరిష్కరించాం. ఏ ఒక్క పని కూడా ఆగదు. అన్నీ నిర్ణీత సమయం కన్నా ముందే పూర్తి చేస్తాం.

– రవి పట్టాన్‌శెట్టి, కలెక్టర్

ప్రతి వీధిలో డ్రెయిన్ నిర్మాణం



రోలుగుంట మండలం కొమరవోలు గ్రామంలో 8వ వార్డులో డ్రెయినేజీ సమస్యతో జనం బాధపడుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ గ్రామంలో రూ.10 లక్షలతో ఎంపీ యూపీ పాఠశాల నుంచి సూరమ్మ చెరువు వరకు 200 మీటర్లకు పైబడి డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం అక్కడ పరిశుభ్రంగా ఉంది.

– పోలవరపు లక్ష్మి, కొమరవోలు గ్రామం

చిటికెలో పరిష్కారం



మా ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు దృష్టికి డ్రెయినేజీ, రోడ్డు సమస్యలను తీసుకెళ్లాం. రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో సీసీ డ్రెయినేజీ వేశారు. మరో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. అంతేకాకుండా రూ.30 లక్షలతో కళ్యాణమండపం నిర్మాణం చేపట్టారు. మా సమీప గణేష్ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ డ్రెయినేజీలు వేశారు.

– ఎడ్ల హేమంత్‌కుమార్, దొర్లవీధి, మాడుగుల

క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి రేపు శంకుస్థాపన

- ఎంపీ డాక్టర్ సత్యవతి



విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈనెల 29న క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి చెప్పారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 50 పడకలతో నిర్మించనున్న క్రిటికల్ కేర్ యూనిట్‌కు రూ.22.5 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ విభాగం అందుబాటులోకి వస్తే అత్యవసర కేసులను కేజీహెచ్‌కు తరలించాల్సిన పరిస్థితి ఎదురుకాదన్నారు.

క్రీడా సంబరం

ప్రస్తుతం క్రీడలకు ఎంతో అనుకూల వాతావరణం ఉందని ఎంపీ చెప్పారు. ఆడుదాం ఆంధ్రా ప్రోత్సాహిక క్రీడాకారులకు చక్కని అవకాశమన్నారు. పోర్ట్ ట్రస్టు సీఎస్ఆర్ నిధుల నుంచి ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని రూ.కోటితో అభివృద్ధి చేస్తున్నామన్నారు. తొలివిడతలో రూ.25 లక్షలు కలెక్టర్ ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వంటి క్రీడలకు ఈ నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.2 కోట్లు కోరినట్లు తెలిపారు. మండలంలో సీతానగరం హైస్కూల్ క్రీడా మైదానాన్ని రూ.36 లక్షల ఎంపీ నిధులతో అభివృద్ధి చేశామన్నారు. బొజ్జన్నకొండను రూ.ఏడున్నర కోట్లతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, జనవరి 10వ తేదీలోగా పనులు పూర్తి చేస్తామన్నారు.

కింతలి ఘాట్‌రోడ్డుకు మోక్షం

- చోడవరం మండలం గవరవరం–ఎ.కోడూరు రోడ్డుకూ నిధులు
- రెండింటికీ రూ.11 కోట్లు మంజూరు
- త్వరలో టెండర్ల ఆహ్వానం
- సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సీఎం బూడి



మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

సాక్షి, అనకాపల్లి: మాడుగుల నియోజకవర్గంలో కింతలి ఘాట్ రోడ్డు, చోడవరం మండలం గవరవరం నుంచి ఎ.కోడూరు రోడ్డులకు మోక్షం లభించింది. ఈ రెండింటి నిర్మాణపనులకు రూ.11 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం ఆర్‌అండ్‌బీ శాఖ జీవో జారీ చేసింది. నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ.. మాడుగుల, చోడవరం నియోజవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన కొద్ది కాలంలోనే నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు.రెండు నియోజకవర్గాల ప్రజలూ సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు.

మాడుగుల మండలంలో 40 గ్రామాల ప్రజలకు ఆధారంగా ఉన్న 9.6 కిలోమీటర్ల మేర కింతలి ఘాట్‌రోడ్డు, చోడవరం మండలంలో గల గవరవరం– ఎ.కోడూరు వరకూ 9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాలనుకు రూ.11 కోట్లు నిధులు మంజూరైనట్టు చెప్పారు. త్వరలో టెండర్ కూడా పిలవనున్నట్టు తెలిపారు. వీలైనంత మేర త్వరితగతిన నిర్మాణపనులు పూర్తిచేసేలా కృషి చేస్తామన్నారు.

నేటి నుంచి గోవాడ సుగర్స్‌లో రెగ్యులర్ క్రషింగ్

- చెరకు రైతుల బకాయిల గ్రాంట్‌కు జీఆర్‌వో విడుదల చేసిన ప్రభుత్వం



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది రెగ్యులర్ క్రషింగ్‌ను గురువారం నుంచి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు యార్డును శుభ్రం చేయడంతోపాటు చెరకు కాటాలను సిద్ధం చేశారు. ఈ ఏడాది 2లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే పక్వానికి వచ్చిన చెరకు తోటల్లో రసనాణ్యత పరీక్షలు నిర్వహించడంతో పాటు చెరకు కటింగ్ పర్మిట్లు కూడా ఫీల్డు సిబ్బంది ద్వారా రైతులకు అందించడం ప్రారంభించారు. మరో పక్క చెరకు రైతులకు గత సీజన్‌కు సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. రైతుల బకాయిలు, కార్మికుల జీతాలు చెల్లించేందుకు రూ.13.40 కోట్లు గ్రాంటు రూపంలో ఇవ్వడానికి నిర్ణయించింది. బుధవారం తాజాగా బడ్జెట్ రిలీజ్ ఆర్డర్‌ను విడుదల చేసింది. బీఆర్‌వో రావడంతో గ్రాంటు రూపంలో వచ్చే నిధులు త్వరలో ఫ్యాక్టరీ ఖాతాలోకి త్వరలో జమ కానున్నాయి.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఆటోలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, చిత్రంలో ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

తుమ్మపాల: ప్రతి మహిళా ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'ఉన్నతి–మహిళా శక్తి' కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి పాల్గొన్నారు. వీరు వివిధ మండలాలకు చెందిన తొమ్మిది మంది ఎస్సీ మహిళా లబ్ధిదారులకు ఆటోలు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉన్నతి పథకం ద్వారా పేద ఎస్సీ మహిళలకు వడ్డీలేని రుణాలిచ్చి వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వం ధ్యేయమన్నారు. ప్రతి మహిళా ఇలాంటి స్వయం శక్తి పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ లబ్ధిదారులు వాహనం ధరలో 10 శాతం చెల్లిస్తే, మిగిలిన 90 శాతం ఋణాన్ని వడ్డీ లేకుండా మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాలో 9 మండలాలలో 9 మంది మహిళలకు రూ.24,60,524 రుణం ఇచ్చినట్టు చెప్పారు. ఒక్కొక్కరికీ రూ.3,03,434 విలువైన ఆటోలను అందజేసినట్టు తెలిపారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ మహిళా శక్తి పథకం ద్వారా మాడుగుల, పాయకరావుపేట, కోటవురట్ల, సబ్బవరం, మునగపాక, అచ్యుతాపురం, బుచ్చెయ్యపేట, రావికమతం, చోడవరం మండలాల మహిళలు ముందుకు వచ్చి ఆటోలు తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. డీఆర్డీఏ పీడీ శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఏపీడీ డైజీ డ్వామా పీడీ సందీప్ పాల్గొన్నారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలకు గురుకుల విద్యార్థిని



బాక్సింగ్ క్రీడాకారిణి లక్ష్మీ తేజస్వినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరి

నర్సీపట్నం: నేషనల్ బాక్సింగ్ పోటీలకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల విద్యార్థిని ఏడిద లక్ష్మీ తేజస్విని ఎంపికైంది. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో తేజస్విని పాల్గొంది. 81 కిలోల విభాగంలో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 30 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో తేజస్విని పాల్గొననుంది. మెడల్ సాధించిన క్రీడాకారిణిని, తర్ఫీదు ఇచ్చిన పీడీ ఎస్.సాయిని ప్రిన్సిపల్ రాజేశ్వరి అభినందించారు. ప్రముఖ వ్యాపారి వెలగా నారాయణరావు బాక్సింగ్ గ్లౌజ్ కిట్‌ను తేజస్వినికి బహూకరించారు.

లక్ష్యాల మేరకు రుణాల మంజూరు



2023-24 ఆర్థిక సంవత్సరం పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- డీసీసీ డీఎల్ఆర్ సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో లక్ష్యాల మేరకు రుణాల మంజూరు చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బ్యాంకు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా రుణాలు మంజూరు చేయడంలో అవసరమైన డాక్యుమెంట్లపై రుణగ్రహీతలకు అవగాహన కల్పించాలన్నారు. రుణాలను వీలైనంత వేగంగా అందజేసేందుకు బ్యాంకులు, అధికారులు కృషి చేయాలని తెలిపారు. గతంలో చేసిన రుణాలు, బకాయిల చెల్లింపులు, బ్యాంకు లావాదేవీలను ప్రామాణికంగా తీసుకోవచ్చని చెప్పారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించిన రుణాలు కూడా త్వరగా అందజేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడాలని సూచించారు. డీఆర్‌డీఏ, వ్యవసాయ, పశుసంవర్ధక, పరిశ్రమల శాఖల అధికారులు బ్యాంకు అధికారులను సమన్వయం చేసుకుంటూ తమ శాఖలకు చెందిన లబ్ధిదారులకు రుణాలు వీలైనంత వేగంగా మంజూరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల ద్వారా అందజేసిన రుణాలను వివరించారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కన్వీనర్, యూబీఐ రీజనల్ మేనేజర్ పి.నరేష్, ఆర్బీఐ ఏజీఎం హనుమకుమారి, మెప్మా పీడీ సరోజిని, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాదరావు, వ్యవసాయ శాఖ జేడీ మోహనరావు, ఉద్యానవన శాఖ డీడీ ప్రభాకరరావు, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, మత్స్య శాఖ డీడీ ప్రసాద్ రావు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘనస్వాగతం



గవర్నర్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొనేందుకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ బుధవారం వేకువజామున విశాఖపట్నం చేరుకున్నారు. రైలు మార్గం ద్వారా విశాఖ చేరుకున్న ఆయనకు జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో ముస్కాన్ క్వాలిటీ బృందం

- చిన్నారులకు అందుతున్న సేవల పరిశీలన



చిన్నపిల్లల వార్డులో రికార్డులు పరిశీలిస్తున్న 'ముస్కాన్' సభ్యుడు అమిత్‌కుమార్

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని బుధవారం ముస్కాన్ క్వాలిటీ వైద్య బృందం సందర్శించింది. బృందం సభ్యులు సి.శ్రీరాం (బెంగళూర్), అమిత్‌కుమార్ (ఉత్తరప్రదేశ్) ఆస్పత్రిలోని నవజాత శిశువుల వార్డు, ప్రసూతి వార్డ్, పిల్లల ఓపీ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ చిన్నారులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యాలయంలో రికార్డులు పరిశీలించారు. వైద్యబృందం సభ్యులు గురువారం కూడా ఆస్పత్రిలోని పై మూడు విభాగాలను తనిఖీ చేస్తారని వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఇక్కడ చిన్నారులకు అందుతున్న సేవలపై నివేదిక తయారు చేసి కేంద్రానికి నివేదించనున్నారని చెప్పారు. ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి మణికంఠ, చిన్నపిల్లల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రదీప్ పటేల్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రదీప్ పటేల్

తగరపువలస: భీమిలిలోని తూర్పుతీర నేవల్ స్టేషన్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రదీప్ పటేల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రదీప్ పటేల్ 1996లో నేవీలో ప్రవేశించి తూర్పు, పశ్చిమ తీర నేవల్ కమాండింగ్ పరిధిలోని రంజిత్, ప్రళయ, టబర్, త్రిఖండ్ తదితర వార్‌షిప్‌లలో విధులు నిర్వర్తించారు. పశ్చిమ తీరంలో ఫ్లీట్ ఎలక్ట్రికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. బంగ్లాదేశ్ జూనియర్ స్టాఫ్ కళాశాల, సీడీఏసీలో ఐటీ మేనేజ్‌మెంట్, వెల్లింగ్‌టన్–మద్రాసు విశ్వవిద్యాలయంలో డిఫెన్స్ అండ్ స్ట్రాటజీస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ముంబయి ఎన్‌హెచ్‌సీసీలో ఎంఫిల్ పూర్తి చేశారు. 2003లో నేవల్ స్టాఫ్ చీఫ్‌గా, 2001, 2008లో ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా, ఐఎన్ఎస్ త్రిఖండ్‌లో వెపన్ సిస్టమ్‌లో ఎలక్ట్రికల్ ఆఫీసర్ విధులు నిర్వర్తించారు.

బ్రిడ్జి కోర్సు శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించే బ్రిడ్జి కోర్సు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ) ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. జనవరి 2 నుంచి 31 వరకు బ్రిడ్జి కోర్సు ట్రెనింగ్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. ఈ నెల 31లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ట్రెనింగ్ ఆఫీసర్ సిహెచ్.లలిత కుమారి(కోపా ట్రేడ్) కంచరపాలెం పాత ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా..' ర్యాలీ వాయిదా

అనకాపల్లి: ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో భాగంగా పట్టణంలో గురువారం నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీ వాయిదా పడినట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల దృష్ట్యా వాయిదా వేసిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియజేస్తామన్నారు.

గణపర్తిలో చోరీ

మునగపాక: మండలంలోని గణపర్తిలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. అయితే ఎంతమేర నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయో తెలియాల్సి ఉంది. వివరాలు. గణపర్తి గ్రామానికి చెందిన దార వెంకట శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి శబరిమల యాత్రకు వెళ్లారు. శంకర్ బంధువైన వ్యక్తి రోజూ సాయంత్రం సమయంలో ఇంటి ఆవరణలో లైటు వేసి ఉదయాన్నే ఆపేస్తున్నాడు. బుధవారం ఉదయం లైట్ ఆపేందుకు రాగా ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించి శంకర్‌కు, మునగపాక పోలీసులకు సమాచారం అందించాడు. శంకర్ వచ్చేంతవరకు ఎంత మేర చోరీ జరిగిందో చెప్పలేమని మునగపాక పోలీసులు తెలిపారు. గురువారం క్లూస్ టీమ్‌ను రప్పిస్తున్నట్లు వెల్లడించారు.

ఇబ్బందులు లేకుండా భూ సేకరణ

మహారాణిపేట: సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన గంగవరం పోర్టు–తుంగ్లాం హైవే రోడ్డు నిర్మాణంపై విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సమీక్షించారు. గాజువాక, ఆటోనగర్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు గంగవరం అదానీ పోర్టు నుంచి కార్గో వాహనాల రాకపోకలకు అనువుగా ఈ రోడ్డును ప్రతిపాదించారు. స్థానిక ప్రజలు, పరిశ్రమల నిర్వాహకుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని మార్చిన అలైన్‌మెంట్, కొత్త డీపీఆర్ రూపకల్పనపై వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా భూసేకరణ చేపట్టి, బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో రూపొందించిన డీపీఆర్‌పై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని.. డిజైన్‌లో మార్పులు చేసినట్లు ఎస్‌హెచ్‌ఏఐ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వే, ఇరిగేషన్, స్టీల్‌ప్లాంట్, ఆర్అండ్‌బీ అధికారులతో సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన చేశామన్నారు. తదుపరి చేపట్టబోయే చర్యల గురించి సమగ్రంగా వివరించారు.

విలువలతో కూడిన విద్య అవసరం

గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్



విశాఖ వేలీ స్కూల్‌లో మాట్లాడుతున్న గవర్నర్ సతీమణి సమీరా నజీర్



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్ తెలిపారు. విశాఖ వేలీ స్కూల్‌ను ఆమె కలెక్టర్ మల్లికార్జున సతీమణి డాక్టర్ నిహారిక, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సతీమణి డాక్టర్ పృథ్వీతో కలసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సమీరా నజీర్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిని కాపాడే విధంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. విద్యార్థులు పుస్తకాల ద్వారా ప్రాచీన భారతదేశ చరిత్ర తెలుసుకోవచ్చన్నారు. దేశ గౌరవాన్ని నిలబెట్టే పరిజ్ఞానం అందరికీ అవసరమన్నారు. విద్యార్థులు చదువు మీద శ్రద్ధ పెట్టాలన్నారు. సెల్‌ఫోన్లు, యూ ట్యూబ్ ఎక్స్(ట్విట్టర్) చూడవద్దని ఆమె సూచించారు. చదువు అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా విజ్ఞానం సంపాదించాలనే ఆలోచనతో ఉండాలన్నారు. చదువు ఆర్థిక పరిస్థితిలో మార్పు తీసుకొస్తుందన్నారు. భారత దేశంలో వర్సిటీలు విజ్ఞానం అందించడంలో ప్రపంచం వర్సిటీలతో పోటీపడుతున్నాయన్నారు. అనంతరం కలెక్టర్ సతీమణి, నిహారిక, జీవీఎంసీ కమిషనర్ సతీమణి పృథ్వీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రమశిక్షణ మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాల సాధించిన విజయాలు, పాఠశాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చేస్తున్న కృషి గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేయడంతోపాటు పాటలు పాడి అలరించారు.

మూడో గురువారం పూజలకు ఏర్పాట్లు



ప్రత్యేక పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవ మూడో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, రీడింగ్ రూమ్ ఎదురుగా ఉన్న రోడ్డులో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. మంచినీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. పలు దేవాలయాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చామని, ఆలయ పరిసర ప్రాంతమంతా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా జీవీఎంసీ సహకారం తీసుకున్నట్లు తెలిపారు. కాగా.. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూ టికెట్లు ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం(వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. జగదాంబ జంక్షన్ మీదుగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు సందు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం చేరుకోవాలి. అక్కడే వాహనాలు పార్కు చేసి కాలి నడకన అమ్మవారి గుడికి రావాలి.

- కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలు సీహార్స్ జంక్షన్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు పార్కింగ్ చేసుకుని కాలినడకన రావాలి.
- వన్‌టౌన్, పాత పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా అమ్మవారి గుడికి వచ్చే ద్విచక్ర వాహనచోదకులు లక్ష్మీటాకీస్, ఎంవీడీఎం హైస్కూల్ మీదుగా కురుపాం మార్కెట్ మెయిన్‌రోడ్డు కిరువైపులా పార్క్ చేసుకోవాలి.
- వన్‌టౌన్, పాత పోస్టాఫీస్ జంక్షన్లు మీదుగా అమ్మవారి ఆలయానికి వచ్చే నాలుగు చక్రాల వాహనదారులు కురుపాం మార్కెట్‌లోని ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి.
- వీఐపీలు, రూ.500 టికెట్ తీసుకునే వారు బీచ్ రోడ్డు మీదుగా టౌన్ హాల్‌కు చేరుకుని.. అక్కడే తమ వాహనాలను పార్క్ చేసుకోవాలి.

జిందాల్ ఒప్పందం రద్దు చేయాలి

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జిందాల్ సంస్థతో చేసుకున్న రహస్య ఒప్పందాన్ని తక్షణం రద్దు చేసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం స్టీల్‌ప్లాంట్‌కు పూర్తిగా నష్టదాయకమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నగరంలోని గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి పెద్ద ఎత్తున కార్మికులు బైక్ ర్యాలీగా వెళ్లి, సంఘీభావం తెలిపారు. పోరాట కమిటీ నాయకుడు అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి ప్రతీ నెల రూ.550 కోట్ల ఫిక్స్‌డ్ ఖర్చు ఉంటుందన్నారు. ఇందులో రూ.180 కోట్లు స్టీల్ ప్లాంట్‌కు చేసిన అప్పుకు వడ్డీ చెల్లించాలని, కార్మికుల వేతనాల నిమిత్తం రూ.220 కోట్లు, తరుగుదల రూ.100 కోట్లను ఇప్పటి వరకు బ్లాస్ట్‌ఫర్నేస్–1,2 భరిస్తున్నాయన్నారు. నేడు ప్రారంభమవుతున్న బ్లాస్ట్‌ఫర్నేస్–3 ఈ ఖర్చులను భరిస్తుందా అంటే యాజమాన్యం దగ్గర సమాధానం లేదన్నారు. డి.ఆదినారాయణ మాట్లాడుతూ నూతన వేతనాలు అమలు చేయకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, వై.టి.దాస్, కారు రమణ, డి.సురేష్‌బాబు, రామ్మోహన్ కుమార్, గణపతిరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు



పింక్ మొబైల్ టాయిలెట్లను ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్(విశాఖ): నగరంలో మహిళల కోసం ప్రత్యేకంగా పింక్ మొబైల్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం రెండు పింక్ మొబైల్ టాయిలెట్లను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. వాహనాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీకి చెందిన రెండు బస్సులను సుమారు రూ.11.5లక్షలతో పింక్ మొబైల్ టాయిలెట్లుగా ఆధునికీకరించినట్లు చెప్పారు. స్వచ్ఛ విశాఖే లక్ష్యంగా టాయిలెట్ 2.0 చాలెంజ్‌లో భాగంగా నగరంలో 20 టాయిలెట్లను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండు పింక్ మొబైల్ టాయిలెట్లను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ టాయిలెట్లలో మహిళల కోసం బాత్రూం, ఇండోర్ లైటింగ్, ఫ్యాన్, శానిటరీ ప్యాడ్, వెండింగ్ మిషన్, ఇన్సినరేటర్‌తో కూడిన డైపర్ డిస్పెన్సరీ, తగిన సీట్లతో కూడిన బేబీ ఫీడింగ్ రూమ్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. బీచ్‌రోడ్డు, రద్దీ ప్రాంతాలు, పబ్లిక్ మీటింగ్‌ల వద్ద ఇవి అందుబాటులో ఉంటాయన్నారు. సీఎంవోహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు, ఏఎంవోహెచ్ డా.కిశోర్, ఎస్‌ఈ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తాచేరు డైవర్షన్ రోడ్డుపై వాహనాల రాకపోకలు



పూర్తయిన డైవర్షన్ రోడ్డులో వెళ్తున్న వాహనాలు



వాహనాల రాకపోకల్ని పర్యవేక్షిస్తున్న పోలీసులు

- బీఎన్ రోడ్డులో 10 రోజుల తర్వాత వాహనాలకు అనుమతి

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం–నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెనపై డైవర్షన్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. వందేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన ఇటీవల కూలిన విషయం తెలిసిదే. దీంతో బీఎన్ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో యుద్ధ ప్రతిపాదికన ఆర్అండ్‌బీ అధికార్లు డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. తాచేరు నదిలో సిమెంట్ గొట్టాలు, రాయి, గ్రావెల్‌తో ఈ రోడ్డును సిద్ధం చేశారు. పది రోజుల తర్వాత విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం, పాడేరు, నర్సీపట్నం, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు ఈ రోడ్డు మీదుగా ప్రయాణ సౌకర్యం కలిగింది. తాచేరు నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. డైవర్షన్ రోడ్డు కొత్తగా వేయడంతో ప్రస్తుతం పాదచారులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, మినీ బస్సుల వరకు మాత్రమే ఆర్అండ్‌బీ అధికారులు రాకపోకలకు అనుమతిచ్చారు. రెండు రోజుల్లో ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలను విడిచిపెడతామని అనకాపల్లి ఆర్అండ్‌బీ డీఈ ధనుంజయ్ తెలిపారు. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. డైవర్షన్ రోడ్డు పూర్తవడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోకుండా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కుమారస్వామి, వంతెనకు ఇరువేపులా తమ సిబ్బందిని నియమించి, వాహనాలను విడిచి పెడుతున్నారు.

అణగారిన వర్గాల పట్ల వివక్ష లేకుండా చూడాలి

- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశంలో ఆర్డీవో జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: గ్రామాల్లో అణగారిన వర్గాలు వివక్షకు గురి కాకుండా మండల స్థాయి అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సబ్ డివిజనల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్, ఆర్డీవో హెచ్‌వీ జయరాం అధికారులకు సూచించారు. బుధవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీ ఉద్దేశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, పీవోపీ, పీసీఆర్ యాక్ట్‌లను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గొలుగొండ మండలం, తాళ్లచీడికాడ, రావికమతం మండలం, గర్నికం గ్రామాల్లో శ్మశానాలకు వెళ్లే రహదారికి అభ్యంతరం పెట్టడంతో ఎస్సీ, ఎస్టీలు ఇబ్బందులు పడుతున్నారని కమిటీ సభ్యులు చిట్ల చలపతిరావు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. రోలుగుంటలోని కుసర్లపూడి శ్మశానానికి వేసిన ఇనుప కంచెలను తొలగించి, ఇబ్బందుల్లేకుండా చూడాలని సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని కమ్యూనిటీ హాళ్ల మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సివిల్ రైట్స్ డేను ఘనంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సీఐ రమణయ్య, ఎస్సై సుధాకర్, నాలుగు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతలకు అభినందన



బీబీ పట్నం హైస్కూల్లో విజేతలతో పాఠశాల సిబ్బంది



కొమరవోలులో విజేతలతో పాఠశాల సిబ్బంది

రోలుగుంట: ఈ నెల 24, 25 తేదీల్లో చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, పలు పతకాలు సాధించిన విద్యార్థులను బుధవారం ఆయా పాఠశాలల సిబ్బంది అభినందించారు. బీబీ పట్నం పాఠశాల నుంచి బోడె వాసవీశ్రీ బంగారు పతకం, ఇద్దరు రజత, ఐదుగురు కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మారావు, పీడీ కె.సావిత్రి అభినందించారు. కొమరవోలు పాఠశాల నుంచి పి.నీలిమ, సీహెచ్ రిషిత్, ఎస్.భువనేశ్వర్‌లు గోల్డ్, ఒకరు సిల్వర్ పతకం సాధించారు. వీరిని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు, పీడీ రాజులమ్మ అభినందించారు.

హనుమంతవాక జంక్షన్‌లో ఫ్లైఓవర్

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశం



జాతీయ రహదారిలో సెంట్రల్ మీడియన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: పీఎంపాలెం నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారి మరమ్మతులతో పాటు పలుచోట్ల బీటీ రోడ్లు వేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పీఎంపాలెం నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారిని జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెంకోజీపాలెం నుంచి డైరీ ఫాం వరకు నేషనల్ హైవే మరమ్మతులకు గురైనందున.. ఓ పొర తారురోడ్డును వెంటనే వేయాలని ఆదేశించారు. హనుమంతవాక జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మించేందుకు నేషనల్ హైవే అధికారుల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జాతీయ రహదారిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు మొక్కల సంరక్షణకు గ్రీన్‌బెల్ట్ ప్రదేశాల్లో అవసరమైన చోట చైన్‌లింక్డ్ మెస్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సెంట్రల్ మీడియన్‌లలో అనధికార హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్‌రాజు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదర రావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, ఆర్‌జీవీ కృష్ణ, కార్యనిర్వాహక ఇంజినీర్లు శాంతిరాజు, తారా ప్రసన్న, మత్స్యరాజు పాల్గొన్నారు.

'మాస్టర్స్ అథ్లెటిక్స్'లో మెరిసిన విశాఖ వాసులు



ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖ క్రీడాకారులు

మురళీనగర్: ప్రకాశం జిల్లా రామయ్యపట్నం పోర్ట్ సమీపంలోని చర్చి గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన 43వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగర క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్ర కార్యదర్శి మంగా ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో మురళీనగర్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ 200మీటర్ల పరుగు పందెలో ప్రథమ, 100మీటర్లలో ద్వితీయ స్థానం సాధించారు. 5 కిలోమీటర్ల వాకింగ్‌లో స్వర్ణ పతకం, 400 మీటర్లు రిలేలో కాంస్య పతకం, హ్యామర్ త్రోలో రజతం సాధించారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.రామారావు 5 కి.మీ వాకింగ్‌లో రజతం సాధించారు.

పోలీస్ శాఖ క్రీడాకారులకు పతకాల పంట

పోలీసు శాఖకు చెందిన ఐదుగురు క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. ఎస్.జలు ఉష షాట్‌పుట్‌లో స్వర్ణ పతకం, జావెలిన్ త్రోలో స్వర్ణ పతకం, డిస్కస్ త్రోలో స్వర్ణ పతకం, 400మీ. రిలేలో కాంస్యం సాధించారు. కె.సీతామహలక్ష్మి 5కి.మీ వాకింగ్‌లో స్వర్ణం, హ్యామర్ త్రోలో స్వర్ణం, డిస్కస్ త్రోలో రజతం గెలుచుకున్నారు. ఎం.బాలరాజు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, 200మీ. రన్నింగ్‌లో రజతం, ట్రిపుల్ జంప్‌లో కాంస్యం, సీహెచ్ సంతోష్ షాట్‌పుట్‌లో స్వర్ణం, 800మీ.రన్నింగ్‌లో రజతం, జావెలిన్ త్రోలో స్వర్ణం, టి.సుధాకర్ 400మీ రన్నింగ్‌లో స్వర్ణం, 100మీ.లో రజతం, డిస్కస్‌తో రజతం సాధించారు. డి.సరోజిని 5 కి.మీ. వాక్‌లో స్వర్ణం, 100మీ. విభాగంలో స్వర్ణం, 800 మీటర్ల విభాగంలో కాంస్యం గెలుచుకున్నారు. ఆర్.విమల షాట్‌పుట్‌లో రజతం, 5కే రన్నింగ్‌లో బంగారం, జావెలిన్ త్రోలో రజతం, వీరభద్రరావు హేమర్ త్రోలో బంగారం, డిస్కస్ త్రోలో రజతం, షాట్‌పుట్‌లో రజతం సొంతం చేసుకున్నారు. టీడీ శశి డిస్కస్ త్రోలో స్వర్ణం, హ్యామర్‌త్రో రజతం, ఎం.భాస్కర్ షాట్‌పుట్ స్వర్ణం, జావెలిన్ త్రోలో స్వర్ణం, డి.సూరిబాబు లాంగ్ జంప్‌లో స్వర్ణం, ఎం.సత్యారావు 5కి.మీ వాకింగ్‌లో ద్వితీయ స్థానం, 400మీ రన్‌లో రజతం సాధించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి విశాఖ క్రీడాకారులు ద్వితీయ స్థానాన్ని సాధించారు.

పశుసంవర్ధక శాఖలో క్లస్టర్ విధానం రద్దు

ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ డిమాండ్



సమావేశమైన నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ సభ్యులు

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖలో డైరెక్టర్ అమలు చేస్తున్న క్లస్టర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ విశాఖపట్నం చైర్మన్ ఎస్.అప్పారావు డిమాండ్ చేశారు. హనుమంతవాక వద్ద జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో బుధవారం ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ క్లస్టర్ విధానం వల్ల నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్లను శాఖలో పైస్థాయి అధికారులు హీనంగా చూస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్లు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టి క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పశుసంవర్ధక శాఖకు సంచాలకుడిగా ఐఏఎస్ అధికారిని నియమించాలని, అలాంటప్పుడే కింది స్థాయిలో ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర సభ్యులు బోనం గోవిందరాజు, డి.కోదండరావు, వెటర్నరీ అసిస్టెంట్లు, ఎల్ఎస్ఏ, జేవీవో, వీఎల్‌వోల సంఘాల నాయకులు పి.స్వామినాయుడు, బి.శంకర్, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎఫ్ అదాలత్' తో తక్షణ పరిష్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణ

మురళీనగర్: నిధి ఆప్ కే నికత్ (పీఎఫ్ అదాలత్) ద్వారా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం కుదురుతుందని ఈపీఎఫ్ విశాఖ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.రామకృష్ణ తెలిపారు. పీఎఫ్ ఖాతాదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిర్లా కూడలి లక్ష్మీ హ్యుందయ్‌లో బుధవారం నిర్వహించిన పీఎఫ్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 27న జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఆ రోజు సెలవు అయితే తర్వాత రోజు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందులో ఖాతాదారులు పీఎఫ్ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చని చెప్పారు. వారం రోజుల ముందుగానే వేదిక వివరాలు తెలుపుతామని, విశాఖపట్నం రీజినల్ కార్యాలయం నోటీస్ బోర్డులో వివరాలు ప్రదర్శిస్తామని తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 12 దరఖాస్తులు రాగా 11 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ టి.నాగేశ్వరరావు, సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ ఎస్.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. తదుపరి కార్యక్రమాన్ని జనవరి 27న నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

మిజోరం గవర్నర్ రాక నేడు

మహారాణిపేట: మిజోరం గవర్నర్ డాక్టర్ కంభపాటి హరిబాబు ఈ నెల 28న విశాఖ వస్తున్నారు. న్యూఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో గురువారం రాత్రి 7.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి దసపల్లా హిల్స్‌లో తన నివాసానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు. 29 నుంచి 3వ తేదీ వరకు గవర్నర్ డ్యూటీ నుంచి డిశ్చార్జ్ అవుతారు. జనవరి 4న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి విశాఖ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగే ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొని.. తిరిగి ఇంటికి చేరుకుంటారు. 5న డ్యూటీ నుంచి డిశ్చార్జ్ అవుతారు. 6న ఉదయం 7.15 గంటలకు రాజమహేంద్రవరం వెళతారు. సాయంత్రం 5 గంటలకు తిరిగి విశాఖలోని తన ఇంటికి చేరుకుంటారు. 7న రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి విజయవాడ వెళ్తారు.

క్లుప్తంగా

సీఎం దృష్టికి 'అంగన్‌వాడీ' సమస్యలు



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నేత నాగశేషు

అనకాపల్లి: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ సత్యవతికి ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్పు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచి ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ తదితర డిమాండ్లను వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు జి.కుమారి, అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, యూనియన్ నాయకులు కాసులమ్మ, లక్ష్మి, స్వాతి పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి

తుమ్మపాల: దేశంలో వృత్తులను ప్రోత్సహించడంతో పాటు, వెనుకబడిన 56 బీసీ కులాలకు విశ్వకర్మ యోజన పథకం ద్వారా అతి తక్కువ వడ్డీకి రూ.2 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సీఎస్సీ ప్రతినిధుల సహకారంతో స్వచ్ఛ భారతి సేవా సంఘం, మజ్దూర్ సెల్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి శుభ సత్యనారాయణ ఆధ్వర్యంలో విశ్వకర్మ యోజన పథకం నమోదుపై అవగాహన కల్పించారు. వివిధ వృత్తులకు చెందిన వారు ఆన్‌లైన్‌లో విశ్వకర్మ యోజన పథకానికి నమోదు చేసుకోవచ్చన్నారు.

ఓటరు జాబితాలపై దృష్టి సారించాలి

మునగపాక : బీఎల్‌వోలు ఓటరు నమోదుపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ కోరారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాల్లో తేడాలున్నాయని వాటిని సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మృతి చెందిన వారిని జాబితాల నుంచి ఇంకా తొలగించలేదని, తక్షణమే తగు విచారణ చేపట్టి అటువంటి తేడాలను సవరించాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 4,162 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,610	5,040
మొదటి రకం	4,400	4,680
రెండో రకం	4,000	4,550
మూడో రకం	3,800	4,090

అనకాపల్లి సినిమాలు

ఆక్వామెన్(తెలుగు)	రాజా
సలార్	సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	సత్యనారాయణస్క్రీన్-2
హాయ్ నాన్న	షిర్డిసాయి
సలార్	పర్తిసాయి
మంగళవారం	వెంకటేశ్వర
తికమక తాండ	శ్రీసత్య
సలార్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 70 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-17 యూనిట్లు, ఓ పాజిటివ్-39 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 423 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 391 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.





రెండో విడత ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

బైజూస్ ట్యాబ్‌లతో.. సర్కార్ స్కూళ్లలో డిజిటల్ విద్య

పేదల పిల్లలు పెద్ద పెద్ద చదువులు చదవాలి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా వారికి అత్యుత్తమ బోధన అందాలి. అదే లక్ష్యంతో సీఎం జగన్ ప్రభుత్వం మనబడి నాడు–నేడు పథకంలో సర్కారీ స్కూళ్లను చరిత్ర ఎరుగని స్థాయిలో అభివృద్ధి చేసింది. అంతటితో ఆగకుండా ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ పాఠ్యాంశాల బోధనకు నడుం బిగించింది. అందులో భాగంగానే గతేడాది నుంచి 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన **ట్యాబ్‌లను పంపిణీ చేస్తోంది.**



నా పేరు పల్లా పూజిత. మాది మండలంలోని మూలపేట గ్రామం. నేను జీవీఎంసీ వేల్పులవీధి టౌన్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువు తున్నాను. మా నాన్న ముత్యాలు తాపీమేస్త్రి. తల్లి వరలక్ష్మీ గృహిణి. పేదకుటుంబం కావడంతో ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్లో చదివించే స్థోమత మా వాళ్లకు లేదు. నేను చదువుతున్న ప్రభుత్వ స్కూల్ నా ఫ్రెండ్స్ చదువుతున్న ప్రైవేట్ స్కూళ్ల కంటే చాలా గొప్పగా ఉంది. 8వ తరగతిలో ఉన్నపుడు బైజూస్ ట్యాబ్ ఇచ్చారు. స్మార్ట్ ఫోన్ వాడటం రాని నాకు, ట్యాబ్ వాడటం మొదట్లో కాస్త ఇబ్బంది అనిపించింది. టీచర్ల సూచనలతో ట్యాబ్‌ను ఎలా వినియోగించాలో తెలుసుకున్నా. ఇపుడు రోజూ ట్యాబ్‌లో పాఠ్యాంశాల వీడియోలు చూస్తా. పాఠ్యపుస్తకంలో కంటే గొప్పగా ట్యాబ్‌లో వీడియో పాఠ్యాంశాలున్నాయి. మా చదువు పట్ల జగన్ మామయ్య చూపిస్తున్న శ్రద్ధకు రుణపడి ఉంటాం.

అనకాపల్లి మండలం, పట్టణంలో 2,853 మంది విద్యార్థులకు లబ్ధి

డిజిటల్ పాఠ్యాంశాలతో విద్యార్థులకు మరింత మేలు

అనకాపల్లిలో...

ప్రభుత్వ హైస్కూళ్లు	
మండలంలో	11
పట్టణంలో	6
మొత్తం	17

అందించిన ట్యాబ్‌లు: 2022లో 1540 మందికి; 2023లో 1313 మందికి

ఒక్కో ట్యాబ్ విలువ - సుమారు రూ.33 వేలు (కంటెంట్‌తో కలిపి)

మొత్తం విద్యార్థులు, లబ్ధి - 2853 మందికి రూ.9.42 కోట్లు

అనకాపల్లి: కరోనా మహమ్మారి విజృంభణతో ఆన్‌లైన్, డిజిటల్ పాఠ్యాంశాల ప్రాధాన్యత ప్రపంచానికి తెలిసొచ్చింది. అందులో కూడా ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు వెనుకబడరాదని బైజూస్ డిజిటల్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఉచితంగా అందించింది. ఇందులో భాగంగా అనకాపల్లి మండలం, పట్టణం పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో చదువుతోన్న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. గతేడాది ప్రారంభమైన ఈ యజ్ఞం ఈ ఏడాది కూడా కొనసాగింది.

అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా..

దేశ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా పాఠ్యాంశాలను రూపొందించి, ఈ ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు అందిస్తున్నారు. స్కూళ్లలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను ఇంటి వద్ద పునశ్చరణ చేసుకునేందుకు బైజూస్ ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

8వ తరగతి నుంచే సీబీఎస్‌ఈ విధానాన్ని ప్రవేశపెట్టి, వారిలో నైపుణ్యాలను మరింత పదును పెట్టేందుకు ప్రభుత్వం ఈ ట్యాబ్‌లను పంపిణీ చేసింది. ఐఐటీ, నీట్ తదితర జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మన విద్యార్థులు మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు ఈ డిజిటల్ కంటెంట్ కీలకంగా మారుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ ఏడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీతో, ప్రస్తుతం 8, 9వ తరగతి విద్యార్థులంతా డిజిటల్ కంటెంట్ పొందినట్లయింది.



జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో బైజూస్ ట్యాబ్‌లతో 8వ తరగతి విద్యార్థులు

మా మంచి మామయ్య.. సీఎం జగన్



జగన్ మామయ్య మా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చదువుల కోసం చాలా మార్పులు తీసుకొచ్చారు. మెరుగైన విద్యా బోధన అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. టీచర్లు అన్ని పాఠాలను ఇంగ్లిష్, తెలుగులోనూ బోధిస్తున్నారు. క్లాస్ రూంలో డిజిటల్ విద్య అందిస్తున్నారు. ఈ ఏడాది బైజూస్ ట్యాబ్‌లను అందించారు. ఆ సంతోషం చెప్పలేనంత. గతంలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పుస్తకాల్లో రాసుకుని, చదువుకునేదాన్ని. ఇపుడు కొత్తగా ఇచ్చిన బైజూస్ ట్యాబ్ సాయంతో చదువుకుంటా.

– శృతి, 8వ తరగతి, సత్యనారాయణపురం

డిజిటల్ విద్యతో బోధన తీరు మారింది



ప్రస్తుతం మా స్కూల్లో డిజిటల్ విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. దీంతో మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులతో పోటీ పడేందుకు అవసరమైన బోధన మాకు అందుతోంది. మా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు, ప్రభుత్వం.. మేంగొప్పగా చదువుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం జగన్ పాలనలో ప్రభుత్వ స్కూళ్లు చాలా బాగా అభివృద్ధి చెందాయి. ప్రభుత్వం ఇస్తున్న ట్యాబ్‌లను ఎలా వాడాలో 9వ తరగతి విద్యార్థుల్ని అడిగి తెలుసుకుంటా.

– ఎస్.యుగంధర్, 8వ తరగతి, గాంధీనగరం

ఉత్సాహంగా.. ఆడుదాం ఆంధ్రా పోటీలు



పట్టణంలోని డీసీఎంఎస్ ఆవరణలో ఖోఖో పోటీలో క్రీడాకారులు



రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు



మార్టూరులో క్రికెట్ పోటీలో పాల్గొన్న క్రీడాకారిణులు

అనకాపల్లి: పట్టణం, మండల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు బుధవారం ఉత్సాహంగా కొనసాగాయి. గ్రామీణ ప్రాంతాల్లో మెరికల్లాంటి క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పోటీలకు వేల సంఖ్యలో యువత ఆసక్తి చూపారు. ఆన్‌లైన్‌లో ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకున్న క్రీడాకారులు గ్రామ/వార్డు సచివాలయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రెండో రోజులు స్థానికంగా ఉన్న పలు విద్యా సంస్థల్లోను, డీసీఎంఎస్‌తో పాటు మండలంలోని మార్టూరు, సీతానగరం, కూండ్రం, గోపాలపురం గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, ఖోఖో పోటీలు జరిగాయి. స్థానికంగా జరిగిన పోటీలను ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ, జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ తిలకించారు. ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు. మండలంలో గ్రామాల్లో జరిగిన పోటీలను ఎంపీడీవో కె.లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు స్వయంగా పర్యవేక్షించారు. క్రీడాకారుల్ని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని పలు పాఠశాలల్లో ఆడుదాం ఆంధ్రా.. క్రీడల పోటీలో రెండో రోజు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. స్థానిక బాలికల హైస్కూలులో విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. 4 సచివాలయాల నుంచి 8 జట్లు పోటీ పడ్డాయి. ప్రత్యేక అధికారి రోజారాణి పోటీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీవీ రవికుమార్, హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి రమేష్, పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

- బయ్యవరంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. మూడేసి జట్లు పోటీపడ్డాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు పోటీలను పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ పాల్గొన్నారు.
- నరసింగబిల్లి హైస్కూల్లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. మూడు జట్లు పాల్గొన్నాయి. ఉత్కంఠ భరితంగా పోటీలు సాగాయి. సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మేరీ జోన్స్ పోటీలను పర్యవేక్షించారు.



కశింకోట బాలికల హైస్కూల్లో జరుగుతున్న వాలీబాల్ పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న మండల ప్రత్యేక అధికారి రోజారాణి



నరసింగబిల్లి హైస్కూలులో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు

ఊరూరా మేలుకొలుపులు

కశింకోట: మండలంలోని గ్రామాలు మేలుకొలుపుల భజన గీతాలతో ఆధ్యాత్మికను పెంచుతున్నాయి. ధనుర్మాసం పురస్కరించుకుని గ్రామాల్లో వేకువ జామున మేలుకొలుపు నిర్వహించడం ఆనవాయితీ. దీనివల్ల భక్తితోపాటు ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. తేగాడ, ఏఎస్ పేట, నరసింగబిల్లి తదితర గ్రామాల్లో భక్తులు వేకువ జామున గ్రామ వీధుల్లో హరినామ సంకీర్తనలు పాడుతూ, భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. సూర్యోదయానికి ముందే కార్యక్రమాన్ని ముగిస్తున్నారు.

ఇలా భోగి వరకు మేలుకొలుపులు నిర్వహిస్తారు. కశింకోటలోని గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో మేలు కొలుపు భజనలు ధనుర్మాసం ప్రారంభం నుంచి ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు పర్యవేక్షణలో మహిళలు నిర్వహిస్తున్నారు.



నరసింగబిల్లిలో మేలుకొలుపు నిర్వహిస్తున్న భక్తులు

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం



అన్న సమారాధన చేస్తున్న ఆలయ ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేట అభయ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం అన్న సమారాధన జరిపినట్లు ఆలయ ప్రతినిధులు పీలా తులసి, దొడ్డి శ్రీనివాసరావు, జగ్గారావు, రాజు, సన్యాసిరావులు తెలిపారు. కార్తీక మాసం పూజల్లో భాగంగా తొలిరోజు ప్రారంభించిన అన్నదానం సుమారు 40 రోజుల పాటు నిర్విఘ్నంగా జరిగిందన్నారు. కార్తీక మాసం పూజలు ముగిసిన సందర్భంగా మరోసారి ఘనంగా అన్న సమారాధన జరిపినట్లు పేర్కొన్నారు.

దేవునిగుమ్మం వేంకటేశుని హుండీ లెక్కింపు

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి హుండీని బుధవారం లెక్కించారు. ఆలయ ఆవరణలో జరిగిన హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ముక్కోటి ఏకాదశి వేడుకల్లో భక్తులు కానుకలు, మొక్కుల రూపంలో 5 లక్షల 16 వేల 99 రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారిగా కె.ఆదినారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవో టి.రాజసులోచన, ధర్మకర్తలు సుంకర వెంకటేశ్వరరావు, సూరిశెట్టి చిన్న సన్యాసిరావు, ముమ్మిని పైడిరాజు, శ్రీధరాల కోమలి రామ్మోహన్, రాజాన లక్ష్మీశ్రీనివాస్, బెల్లాన అనురాధ, ఎక్స్ అఫీషియో మెంబర్ పులఖండం గిరిబాబు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ సిబ్బంది

కలశ జ్యోతి, శూలాల ప్రదర్శన

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం గంగిరేవు చెట్టు వద్ద శ్రీగంగపరదేశమ్మ భవానీ భక్తుల ఆధ్వర్యంలో దుర్గమ్మ చండీయాగం, కలశజ్యోతి ప్రదర్శన బుధవారం నేత్రపర్వంగా జరిగింది. అంతకు ముందు భవానీ భక్తులు శూలాలు ధరించి నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో భవానీ భక్తులు కాండ్రేగుల శ్రీరాం, మద్దాల శ్రీను, కె.సుబ్బు, కె.వెంకట, బి.వర, వి.మహేష్, ఎం.గోపి, బి.ఆది, ఎం.సుబ్బు, పి.యుగంధర్, కె.సాంబ, గంగపరదేశమ్మ ఆశ్రమ భక్తులు పాల్గొన్నారు.



కలశ జ్యోతి, శూలాలతో ఊరేగింపులో భవానీ భక్తులు

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

కశింకోట: గ్రామాల్లో సమస్యల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. మండలంలోని అచ్చెర్ల, మోసయ్యపేట పంచాయతీల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మోసయ్యపేట శివారు గోకివానిపాలెంలో ప్రభుత్వ పాఠశాలకు 12 బెంచీలను తన సొంత నిధులతో సమకూర్చనున్నట్లు హామీ ఇచ్చారు. అక్కడి రామాలయంలో 4 ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఫోకస్ లైట్లు ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, బొడ్డేడ చిరంజీవిరావు, పొన్నాడ రాజు, నిమ్మదల రామసూరి, గోకివాడ గోవింద, బొట్టా లోవరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



గోకివానిపాలెం స్కూల్‌ను పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

కొనసాగిన న్యాయవాదుల నిరసన

అనకాపల్లి: ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించలేని 27/2023 చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్‌మంత్రి సాయిలక్ష్మణ్ అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక న్యాయస్థానం వద్ద న్యాయవాదులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష 8వ రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు సంకటంగా మారే ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఆర్టికల్ 19కు విరుద్ధంగా చట్టాన్ని తీసుకురావడం అన్యాయమన్నారు. జ్యుడీషియల్ నుంచి తప్పించి భూములపై అధికారాన్ని ఎగ్జిక్యూటివ్‌కు అప్పగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సూరా శ్రీనివాస్, న్యాయవాదులు మద్దాల గోవింద్, మోహన్, కుమార్, సందీప్, శ్రీనివాస్, రామచంద్రరావు, రాంప్రసాద్, తిలక్, మల్లేష్, కిశోర్, మూర్తి పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

నూకాంబిక ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా మండపం

అనకాపల్లి: నూకాంబిక ఆలయానికి ఉత్సవ మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, పార్టీ యువనేత దాడి జయవీర్‌లు అన్నారు. పట్టణంలోని గవరపాలెం నూకాంబిక ఆలయంలో ఉత్సవ మండపాన్ని దాత దాడి సన్యాసిరత్నం(అమ్మలు)తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక కుంకుమార్చనలకు మండపం ప్రధాన కేంద్రంగా నిలుస్తుందన్నారు. అంతకు ముందు ఆలయంలో ఏర్పాటు చేసిన శిలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, వార్డు ఇన్‌చార్జిలు కొణతాల భాస్కర్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బుద్ద నర్సింగరాజు, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమాశ్రీనివాసరావు, కొండూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, కంటపల్లి శోభారాణి, అర్చకులు యనమండ్ర శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేడ శివ, శిలపరశెట్టి బాబీ, గవరపాలెం గౌరీపరమేశ్వరుల కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, పలు ఆలయాల చైర్మన్‌లు ఆళ్ల నాగేశ్వరరావు, కె.ఎం.నాయుడు, పార్టీ నేతలు రేబాక మధు, మేడిశెట్టి గణేష్ పాల్గొన్నారు.



మండపాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ, ప్రసాద్, దాడి రత్నాకర్, జయవీర్, సన్యాసిరత్నం



శిలకు పూజలు చేస్తున్న మురళీకృష్ణ, ప్రసాద్, దాడి రత్నాకర్, జయవీర్